19వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 05 ఆగస్టు 2025 పేజీలు : 8

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కార మార్గం చూపాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 4 :** ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరెట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 43 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీఓలు మధు సుధన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, డిఆర్డిఓ రఘు వరన్, డీపీవో మధన్ మోహన్, వివిధ జిల్లా అధికారులు, తహసీల్దర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులుపాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యకు పెద్దపీట







**-అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇకపై స్టీలు పాత్రల్లో వంటావార్పు**

**-ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 04 :** సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో స్టీలు పాత్రల్లో వంటావార్పు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో వంటకు కావలసిన స్టీలు పాత్రలను అందజేశారు. అంతకుముందు భోజనశాల, వంట గదులు, అల్పాహారం నాణ్యతను స్వయంగా పరిశీలించిన మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసి ఉదయం పాఠశాల అసెంబ్లీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అల్యూమినియం పాత్రల్లో ఆహారం నిల్వ ఉంచడం వల్ల కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతాయని, అందువల్ల రాష్ట్రంలోని సుమారు 700 గురుకులాల్లో స్టీలు పాత్రల్లో వంటవార్పును చేపట్టనున్నామని అన్నారు. మొట్టమొదటిగా కరీంనగర్ జిల్లా అలుగునూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రారంభించామని తెలిపారు. స్టీలు పాత్రల కోసం ప్రతి పాఠశాలకు నిధులు మంజూరు చేస్తామని అన్నారు. విద్యార్థుల, సంక్షేమం ఆరోగ్యం, బలవర్ధక ఆహారం నాణ్యమైన విద్యలే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అలుగునూరు సంక్షేమ పాఠశాల విద్యార్థులు దేశవ్యాప్తంగా పలు పేరు పొందిన విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం అభినందనీయమని తెలిపారు. అలుగునూర్ పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి సూచించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి మాట్లాడుతూ స్టీల్ పాత్రల్లో వంట వార్పు విధానాన్ని కరీంనగర్ లో ప్రారంభించామని, మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు న్యాయం చేయాలి





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 4 :** నూకపెల్లి అర్బన్ హౌసింగ్ కాలనీ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు న్యాయం చేయాలని, ఇండ్లు కూల్చిన వారందరికీ ఇండ్లు మంజూరు చేయాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం నూకపెల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో 100 మంది లబ్దిదారులు ఇం డ్ల కూల్చి వేయడం పట్ల, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాదన్ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదలకు ఇండ్లు నిర్మించాలని ఉద్దేశ్యంతో 80 గజాల స్థల విస్తీర్ణంలో నూకపెల్లి అర్బన్ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టిందని, 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం టిఆర్ఎస్ ప్రభుత్వం 2వేల ఇండ్లను కూల్చి వేసి వాటి స్థానంలో 4520 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించార న్నారు. మరో 1611 ఇందిరమ్మ ఇండ్లు వివిధ దశల్లో ఉండగా వాటి నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.52 కోట్లు అవసరమని ఈవిషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవలే డబుల్ బెడ్రూం ఇండ్ల మౌళిక వసతుల కల్పనకు మరో 100 ఇందిరమ్మ ఇండ్లను తోలగించారని, ఏలాంటి సమాచారం ఇవ్వకుండా ఇండ్లను ఏలా తొలగిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 3500 డబుల్ బెడ్రూం ఇండ్లలో కేవలం 500 ఇండ్లలో లబ్దిదారులు నివసిస్తున్నార న్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం లో ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, 1611 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వాటికి నిధులు మంజూరు చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ శంకర్, భీరం రాజేష్, ముకస్సర్ అలీ వేహాల్, రియాజ్, మాజీ కౌన్సిలర్లు హన్మాండ్ల జయశ్రీ, పిప్పరి అనిత, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదా రులు పాల్గొన్నారు.

### కారోబార్‌ను తొలగిస్తూ

## జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు

### మిగితా కార్యదర్శులపై చర్యలేవి..?

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 4 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని చంద్రయ్యపల్లె గ్రామ పంచాయితీ కార్యదర్శి రాజన్న డిఎస్ఆర్ యాప్లో హాజరుకు కావాలనే కార్యదర్శి ఫోటో స్థానంలో సీఎం రేవంత్రెడ్డి అప్లోడ్ చేయడంతో సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కారోబార్ భూమయ్యను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి రాజన్న మొబైల్ ఫోన్ను కారోబార్ వద్ద ఉంచడంతో, కారోబార్ భూమయ్య కార్యదర్శి ఫోటో స్థానంలో సీఎం రేవంత్రెడ్డి ఫోటోను అప్లోడ్ చేసినట్లు తేలడంతో విధుల నుండి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో చురకలులో కారోబార్ తప్పిదంతోనే సీఎం ఫోటో అప్లోడ్ చేసినట్లు కథనం ప్రచురితమైంది.

మిగితా కార్యదర్శులు, యంపిఓ ల పై చర్యలు లేవి...?

డిఎస్ఆర్లో సీఎం ఫోటోతో పాటు, రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్. అంబేద్కర్ ఫోటోలతో పాటు పలు ఫోటోలు అప్లోడ్ చేసిన మరో 28 మంది కార్యదర్శులు ఉన్నట్లు, ఒక్కరిపైనే చర్యలు తీసుకొని మిగితా వారిపై చర్యలు తీసుకోకపోవడంతో, మండస్థాయిలో కార్యదర్శులపై ఆజమాయిషీ ఉన్న మండల పంచాయితీ అధికారులపై ఉన్నతాధికారులు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. డిఎస్ఆర్లో హాజరును నిత్యం పరిశీలించాల్సిన జిల్లాస్థాయి అధికారులు ఫెషియల్ రిక్నషన్ ను పర్యవేక్షణ చేయకపోవడంతోనే ఈ వ్యవహారం నడిచినట్లు తెలుస్తుంది.

## గాంజాయి అమ్మిన వ్యక్తి అరెస్ట్, రిమాండ్

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు,04 :** నమ్మదగిన సమాచారం మేరకు కోరుట్ల వెటర్నరీ కాలేజ్ సమీపంలో గాంజా అమ్మకాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ సమాచారంతో స్పందించిన ఎస్ఐ చిరంజీవి తన సిబ్బంది. ఇద్దరు ప్రభుత్వ పంచులతో కలిసి వెటర్నరీ కాలేజ్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎండి ఫయాజుల్ రెహమాన్ (30 సంవత్సరాలు), ముస్లిం, నివాసం: అర్బన్ కాలనీ, కోరుట్ల అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతని వద్ద నిషేధిత గాంజా సుమారు 150 గ్రాములు (దాని అంచనా విలువ రూ.5000/-) స్వాధీనం చేసుకున్నారు. అదనంగా అతని సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి, న్యాయరిమాండ్‌కు తరలించారు. ఫయాజుల్‌కు గాంజా సరఫరా చేసిన మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీసులు ఆయనను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు. భవిష్యత్తులో ఎవరు గాంజా వినియోగించినా, త్రాగినా, రవాణా చేసినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేయగలమని వారు పేర్కొన్నారు.

## ఉత్తమ డాగ్‌గా రామగుండం నార్కోటిక్ సింబ ఎంపిక



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 4 :** రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ లో బంగారు పతకం సాధించిన సింబాకు లభించింది.రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్ గా రామగుండం పోలీస్ కమీషనరేట్ నార్కోటిక్ డాగ్ "సింబా" ఎంపిక చేశారు. వరంగల్ జిల్లా మమునూరు పిటిసిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ లో కాళేశ్వరం జోన్ నుండి నార్కోటిక్ డాగ్ విభాగం పోటీలో పాల్గొనీ గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించడం లో పోలీసు జాగిలం సింబా, డాగ్ హ్యాండ్లర్ ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం. వేణుగోపాల్ కృష్ణ గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. అదేవిదంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్ గా "సింబా" ఎంపిక కావడం జరిగింది. ఈరోజు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తమ కార్యాలయం లో నార్కోటిక్ డాగ్ సింబా, డాగ్ హాండ్లర్ ను అభినందనచడం జరిగింది. 2026 సంవత్సరం ఫిబ్రవరిలో పూణేలో జరిగే నేషనల్ పోలీసు డ్యూటీ మీట్ లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని తెలంగాణ రాష్ట్రానికి, రామగుండం పోలీస్ కమీషనరేట్ కి మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్ ఐపీఎస్., పెద్దపల్లి డిసిపి పి. కరుణాకర్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ ఏ ఆర్ ఏ సి పి ప్రతాప్, ఆర్ ఐ లు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి సంపత్, మల్లేశంపాల్గొన్నారు.

## చదువుతోనే సమాజంలో మంచి మార్పు

**జమ్మికుంట, ఆగస్టు 4 (చురకలు):** మంచి విద్యతోనే సమాజంలో మార్పు మొదలవుతుందని ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే సత్ఫలితాలు వస్తాయని దీనితో వారి బంగారు భవిష్యత్తు బాగుంటుందని యాప్ టీవీ సీఈవో పాడి ఉదయ్ నందన్ రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం తన సొంత నిధులతో నిరుపేద విద్యార్థులకు స్కాలర్షిప్లు అందిస్తూ వారిలో ఆత్మశైరాన్ని నింపుతున్న గొప్ప మానవతావాది ఉదయ్ నందన్ రెడ్డి. అందులో భాగంగా సోమవారం వీణవంక గ్రామంలో నిరుపేద విద్యార్థులకు చదువు ఆర్థిక భారం కావద్దు అనే సంకల్పంతో వీణవంక లో 100% అక్షరాస్యత సాధించాలని, విద్య ద్వారా పొందిన విజ్ఞానం ప్రపంచ స్థాయికి వెళ్తారని నమ్మిన వ్యక్తి పాడి ఉదయ్ నందన్ రెడ్డి. అలాంటి వ్యక్తి తాను పుట్టిన వీణవంక గ్రామంలో నిరుపేద కుటుంబంలో తల్లి లేదా తండ్రి చనిపోయి ఆర్థికభారంతో బాధపడుతున్న కుటుంబంలోని నిరుపేద విద్యార్థుల కుటుంబాలకి మంచి నాణ్యమైన విద్యా అందించాలని మంచి ఉద్దేశంతో 220 మంది అనాథ,నిరుపేద విద్యార్థులకు పాడి ఉదయ్ నందన్ రెడ్డి నెలకి 1000 చొప్పున ఆర్థిక సాయం అందించే దానిలో భాగంగా రెండు నెలల స్కాలర్షిప్లను తన సిబ్బంది ద్వారా మొత్తం 2000 రూపాయల చొప్పున 4,40,000/- రూపాయల స్కాలర్షిప్ లను విద్యార్థులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థుల యొక్క ఉన్నత భవిష్యత్తు కోసం మంచి నాణ్యమైన విద్యను వారి ట్యూషన్ ఫీజు, బుక్స్, పెన్స్ ఇతర స్టడీ మెటీరియల్ కోసం వీణవంక గ్రామం మరియు చుట్టుపక్కల గ్రామాలలోని విద్యార్థులకి అందించాలని గొప్ప లక్ష్యంతో ప్రతినెల విద్యార్థులకు స్కాలర్షిప్ లను అందిస్తున్నారు. ఈ స్కాలర్షిప్స్ ను విద్యార్థులు వారి యొక్క చదువుల కోసం వినియోగించుకుంటున్నారు.

# నేడు పెద్దపల్లికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు రాక

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 4.** భారతీయ జనతా పార్టీ సారథి నూతనంగా ఎన్నికైన రామచంద్రరావు మొదటిసారి పెద్దపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో రెండు గ్రూపులుగా ఆధిపత్యం కోసం చూస్తున్నారు. మొదటిసారి వస్తున్న సందర్భంగా ఆయా గ్రూపుల నాయకులు తమ బలనిరూపణ కోసం ఉబలాట పడుతున్నారు. అలాగే బిజెపి శ్రేణులు రాష్ట్ర నాయకుని కోసం ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. పెద్దపల్లి జిల్లాలో బిజెపికి కార్యకర్తలు, అభిమాను లు మెండుగానే ఉన్నా వారికి సరైన దిశా నిర్దేశం చేసే నాయకులు లేకపోవడమే పెద్ద అవరోధంగా మారిందనేది బహిరంగ రహస్యం. ఇక్కడ రెండు గ్రూపులుగా మారిన నాయకత్వంతో ఆ పార్టీ కార్య కర్తలు అయోమయంలో పడి



పోయారు. ప్రస్తుతం రాష్ట్ర బిజెపి పగ్గాలు చేపట్టిన రామచంద్ర రావు ద్వారా ఈ సమస్యకు ఫుల్ స్టాప్ పడుతుందనే భావన కార్యకర్తలు, క్రింద స్థాయి నాయకుల్లో ఆశ లను చిగురింప చేస్తున్నాయి. గతంలో ఇద్దరు రాష్ట్ర అధ్యక్షులుగా పని చేసినా ఎవరు కూడా ఇలా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదు. కాగా పెద్దపల్లి నియోజకవర్గం లో రెండు వర్గాలుగా రాజకీయాలు సాగుతున్నాయి. ఒకటి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మరొక వర్గం బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వున్న దుగ్యాల ప్రదీప్ కుమార్. అయితే గత శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ దుగ్యాలకు ఇవ్వగా ఆయనకు ఆ పార్టీ స్థానిక నాయకులు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలువ లేకపోయిందనే ప్రచారం జోరుగా సాగింది. ఇక వీరిద్దరూ కూడా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉండరనే అపవాదు కూడా బిజెపిలో బలమైన వాదన చోటు చేసుకున్నది. గతంలో కూడా ఆదినాయకత్వం ఇక్కడ ప్రత్యేక దృష్టి సారించలేదు పైగా గ్రూపు రాజకీయం. దీంతో చాలా మంది పార్టీలోని ఓ వర్గం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు లోపాయి కారంగా మద్దత్తుగా నిలిచారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక రాష్ట్ర నాయకత్వం కూడా పెద్దపల్లి జిల్లాతోపాటు పెద్దపల్లి నియోజకవర్గాన్ని పక్కన పెట్టేశారనే విషయాలు అందరికి తెలిసిన బహిరంగ రహస్యం. ఇప్పటికి జిల్లా అధ్యక్షులు, ఆ స్థాయి నియామకాల్లో కూడా ఆ వర్గాల బలమే బలంగా పని చేశాయి. దీంతో చాలా మంది కార్యకర్తలు, నాయకులు పక్క పార్టీల వైపు దృష్టి సారించారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర అధ్యక్షుల రాక ఈ గ్రూపులకు బలమైన సంకేతాలు ఇవ్వనున్నట్లుగా తెలుస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో కష్ట పడ్డ వారికే భవిష్యత్ లో అవకాశాలు ఉంటాయానే వాదనలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా రాష్ట్ర అధ్యక్షుని రాకతోనైనా గ్రూపు రాజకీయాలకు తెరపడుతుందో లేదో వేచి చూడాలి.

# అంతర్ జిల్లా దొంగతోపాటు, దొంగిలించిన సొత్తు కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్ట్






**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 4:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున కమ్మరపల్లి గ్రామం, నిజాంబాద్ జిల్లా, ప్రస్తుతం ఏసపల్లి ఆర్మూర్ మండలంలో నివాసముంటున్న టేకు చిరంజీవి (22) అనే అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతని నుండి భారీ మొత్తంలో దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలు, నగదు, మరియు దొంగతనాలకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిజామాబాద్ జిల్లాకు చెందిన టేకు చిరంజీవి (22) హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇతను పగలంతా తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రిపూట చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతను తన మారుతి ఫ్రాంక్స్ కారు (నం. %ు+- 16-ూా%-7015)లో కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లోని వేర్వేరు గ్రామాల్లో దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు.

చోరీల వివరాలు:

మే 7, 2025న: నిజామాబాద్ జిల్లా, వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చల నడ్కుడ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసి సుమారు 66 గ్రాముల బంగారం దొంగిలించాడు. ఈ బంగారాన్ని తన తండ్రి గంగ సాయిలు సహాయంతో నందిపేటలోని బంగారు నరసయ్య అనే వ్యక్తికి విక్రయించాడు.

జూన్ 10, 2025న: కరీంనగర్ జిల్లాలోని గన్నేరువరం మండలంలో ఒక ఇంట్లో పావు తులం బంగారు గొలుసు, 4 తులాల వెండి గొలుసులు, రూ. 5,000/- నగదు చోరీ చేశాడు.

జూన్ 30, 2025న: రామడుగు మండలం, శానగర్ గ్రామంలో 5 తులాల బంగారు హారం దొంగిలించాడు.

జూలై 16, 2025న: మానకొండూరు మండలం, గంగిపల్లి గ్రామంలో ఒక తులం బంగారు చైన్, 6 తులాల వెండి, 30,000/- నగదు ఎత్తుకుపోయాడు.

జూలై 22, 2025న: తిమ్మాపూర్ మండలం, పోరండ్ల గ్రామంలో ఏకంగా మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడి సుమారు 2.75 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ. 1,65,000/- నగదు దొంగిలించాడు.

జూలై 23, 2025న: చిగురుమామిడి మండలం, బొమ్మనపల్లి గ్రామంలో ఒక బంగారు షాపుతో సహా మూడు చోట్ల దొంగతనం చేసి సుమారు 5.5 తులాల బంగారం, 90 తులాల వెండి చోరీ చేశాడు. లి జూలై 24, 2025న: గన్నేరువరం మండలం, చీమలకుంటపల్లి గ్రామంలో 3 తులాల బంగారం, 25 తులాల వెండి చోరీ చేశాడు.

దొంగిలించిన సొత్తు కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్ట్: చిరంజీవి నుండి దొంగసొత్తు కొనుగోలు చేసిన, నిజామాబాద్ జిల్లాలోని నందిపేట మండల కేంద్రంలో బంగారు షాపు నడుపుకొని జీవిస్తున్న కొండూరు గ్రామానికి చెందిన బంగారు నరసయ్య (44)ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతను నందిపేటలో బంగారు షాపు నడుపుతూ, తక్కువ ధరకు దొంగిలించిన ఆభరణాలను కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. చిరంజీవి మరియు అతని తండ్రి గంగ సాయిలు ఇతనికి మే 10, 2025న సుమారు 66 గ్రాముల బంగారం విక్రయించగా, బంగారు నరసయ్య వారికి రూ. 1,14,000/- చెల్లించినట్లు తెలిపాడు.

స్వాధీనం చేసుకున్న వస్తువులు:పోలీసులు నిందితుల నుండి మొత్తం 18 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ. 1,00,000/- నగదు, ఒక మొబైల్ ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన మారుతి ఫ్రాంక్స్ కారు, ఇనుప రాడ్లు, గ్లౌజులు వంటి పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.కమీషనరేట్ పరిధిలో దొంగతనాల నివారణకు పోలీసులు నిఘా పెంచుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన ఏసిపి వెంకటస్వామి, సి.సి.ఎస్ ఏసిపి జాన్ నర్సింహులు, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సదన్ కుమార్, సి.సి.ఎస్. ఇన్స్పెక్టర్ ప్రకాష్, ఎల్.ఎం.డి. ఎస్సై శ్రీకాంత్ క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ నరేష్, జైపాల్ , సీసీఎస్ కానిస్టేబుళ్లు రాజశేఖర్ , వేణుగోపాల్, అనిల్, అవినాష్ లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా పోలీస్ అభినందించారు.

# అంగన్వాడి కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు

## -గర్భిణీ స్త్రీలకు సాముహిక శ్రీమంతాలు



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఆగస్టు (04) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామపుర్ ,వేములకుర్తి గ్రామల లోఅంగన్వాడీ కేంద్ర అధ్వర్యం లో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్వాడి టిచర్లు, ఏఎన్ ఎం లు తల్లిపాలపై గర్భిణీలకు బాలింతలకు అవగాహన కల్పించారు. గర్భిణీగా ఉన్నప్పుడే తల్లిపాల పట్ల అవగాహన కలిగి ఉండలని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, కేవలం ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నెలల తర్వాత అదనపు ఆహారం మొదలు పెట్టి తల్లి బిడ్డకు కనీసం రెండు సంవత్సరాలు తల్లిపాలు కొనసాగిస్తూ ఆహారం పెట్టాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా లాగా పని చేస్తాయని, తల్లిపాలు సులువుగా జీర్ణం అవుతాయి ,తల్లిపాలు తాగడం వలన బిడ్డ ఆరోగ్యంగా సురక్షితంగా ఉంటుందని, డబ్బాపాల వలన ఇన్ఫెక్షన్స్ వస్తాయన్నారు. అందుకనే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని అవగాహన కల్పించారు. అనతరం గర్భిణీ స్త్రీలకు శ్రీమతం చేశారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి టిచర్ లు లోక సరిత,లక్ష్మీ ,నర్సు,ఆరోగ్య అదికారి హెమలత,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు మౌనిక, మానస,ఏఎన్ ఎం రామగిరి సుప్రియ,పంచాయతీ కార్యదర్శి నవిన్,ఆశలు రాధ ,మౌనిక గర్భిణి స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

## - టీయూడబ్ల్యూజే(ఐజేయు) అధ్యక్ష కార్యదర్శులు బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్

**చురకలు ప్రతినిధి,మెట్‌పల్లి ,ఆగస్ట్ 04 :** జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని టీ యు డబ్ల్యూజే (ఐజెయు) అధ్యక్ష కార్యదర్శులు బూరం సంజీవ్,మమ్మద్ అజీమ్ అన్నారు. సోమవారం వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ మెట్ పల్లి కార్యవర్గ సమావేశం స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు బూరం సంజీవ్ మహమ్మద్ అజీమ్‌లు మాట్లాడుతూ ఎలాంటి భేదాభిప్రాయాలకు తావివ్వకుండా యూనియన్ లో ఉన్న అందరి జర్నలిస్టుల సహకారంతో జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టియుడబ్ల్యూ జే (ఐజెయు) యూనియన్ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షుడు మాసుల ప్రవీణ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్ సాజిద్ పాషా, గౌరవ సలహాదారులు దాసం కిషన్ ,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , బాసెట్టి హరీష్ ,విజయసాగర్, మహమ్మద్ అఫ్రోజ్, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు బొల్లం రాజు,ఆదిల్ పాషా, ఏసవిని గణేష్ ఎండి అభిద్,సఫీ, రాజశేఖర్,అమ్ముల ప్రవీణ్ పాల్గొన్నారు.



# ఇబ్రహింపట్నం ఎపియంగా ఎ శంకర్

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అగష్టు (04) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం)గా ఎ శంకర్ సోమవారం బాధ్యతలు స్వికరించారు. సాదరణ బదిలలో భాగంగా గతం లో ఇబ్రహింపట్నంలో పనీచేసిన ఎపియం శంకర్ మెడిపెల్లి మండలకు బదిలీ కాగ,కోరుట్ల లో పనిచేస్తున్న ఎ శంకర్ ఇబ్రహింపట్నం వచ్చారు. సిబ్బంది సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.



# కోటేశ్వరస్వామి ఆలయానికి పంపింగ్ మోటార్ బహుకరణ



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 04 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలోపంపింగ్ మోటారులేక నీటికోసంఇబ్బంది కలుగుతున్న విషయం తెలుసు కొన్న కుమ్మరిపల్లె గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు వేల్పుల బాబు 10 వేల విలువ చేసే పంపింగ్ విద్యుత్తు మోటార్ ను సోమవారం ఆలయానికి అందించి భక్తి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్ దాత బాబును శాలువ తో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుమ్ముల వెంకటేష్,అర్చకులు శంకరయ్య, గుంత సంతోష్, ధర్మాజీ గంగారాం, బండారి నరేష్,నోముల వెంకటరెడ్డి,వడకాపరం తిరుపతి,తదితరులుపాల్గొన్నారు.

## బాధితుల సమస్యలకు

# తక్షణ పరిష్కారానికి చర్యలు



## -జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**చురకలు ప్రతినిధి,జగిత్యాల,ఆగస్టు 4 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 19 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# సాంప్రదాయ రీతిలో శ్రావణ సోమవారం వేడుకలు

## -భక్తి శ్రద్ధలతో పూజలలో పాల్గొన్న భక్తులు



**రామ కిష్టయ్య సంగన భట్ల...**

సనాతన సాంప్రదాయాలకు నిలయమై, పలు దేవాలయాల సముదాయంతో విరాజిల్లుతున్న ధర్మపురిలో శ్రావణ సోమవార వేడుకలు సాంప్రదాయ రీతిలో ఘనంగా జరిగాయి. హిందువులకు పరమ పవిత్రంగా భావించబడే శ్రావణంలో క్షేత్రంలో నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగ నుండగా, సోమవారం పవిత్ర దినంగా భావించ బడుతుంది.

**"పరమ పవిత్రం... శ్రావణ సోమవారం"**

శ్రావణమాసం హిందువులకు పరమ పవిత్ర మైనది కాగా, శ్రావణ సోమవారం విశిష్టమైనది. లోకేశ్వరుడు అభయంకరుడైన కని శ్రావణ మాసం అందునా ప్రత్యేకించి, సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో పూజిస్తే శివసాయుజ్యం పొందగలని పురాణాలు విశదీకరిస్తున్నాయి. న్యాసము అనగా ఐక్యము చేసుకోవడం. పూజకు పూర్వం రుద్రుడిని, లింగంలో నిలుపుకుని, తాను రుద్రుడై, ఆ రుద్రుడిని అభిషేకించాలి. అందులకై మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో, కనీసం శ్రావణ సోమ వారమైన శివుని పూజించి, నిరాహారం, ఉప వాసం లేక ఏకభుక్తం చేయాలి. ద్వాదశ మాసాల్లో శ్రావణం, అందునా సోమవారం అత్యంత శ్రేష్ఠమైన దినం. ఈ నేపథ్యంలో శ్రావణ తొలి సోమవారం క్షేత్రం భక్తజనంతో కిటకిటలాడింది. శివకేశవులు నిలయమైన ధర్మపురి క్షేత్రానికి పర్వదిన సందర్భంగా సుదూర ప్రాంతాలనుండి, ఉదయా త్పూర్వం నుండే ఏతెంచిన భక్తులతో పాటు, స్థానిక సాంప్రదాయాచరణ పరులు భారీ వర్షాలను లెక్క చేయక, గోదావరిలో మంగళ స్నానాలు ఆచరించి, వివిధ దేవాలయాలలో దైవ దర్శనాలు చేసుకున్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా, క్షేత్రంలోని శ్రీరామ లింగేశ్వర, అక్కపెల్లి రాజేశ్వర ఆలయాలలో, మార్కండేయ మందిరంలో, వాడవాడలలో గల శివ పంచాయతనాల యందు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సకృతావర్తన రుద్రాభిషే ప్రత్యేక పూజలు, సహస్ర నామ పారాయణాది కార్యక్రమాలను సాంప్రదాయ వేదోక్తరీతిలో కన్నుల పండువగా, భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ నారసింహ, శ్రీవేంకటేశ్వర, ఆంజనేయ, యమ ధర్మరాజు, వేణుగోపాల, శ్రీరామ, దత్తాత్రేయ, శ్రీసాయి బాలాజీ, గౌతమేశ్వర ఆలయాలలో అర్చకులు ప్రత్యేక అర్చనలు గావించారు. దేవస్థాన అంతర్గత శ్రీరామలింగేశ్వర ఆలయంలో, దేవస్థానం ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తలు, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సిబ్బంది పర్యవేక్షణలో, వేద పండితులు బొజ్జా రమేశ్ శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, ఆలయాల అర్చకులు దేవళ్ళ విశ్వనాథ శర్మ, శ్రావణ శాశ్వత నిధి ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. శ్రీ అక్కపెల్లి రాజేశ్వ రాలయంలో అర్భకులు బూస ప్రవీణ్, జన మంచి శ్రీనివాస్, వేదవిదులు రుద్రాభిషేకాలు, శాశ్వతనిధి పూజలు జరిపారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


**-కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు**



**చురకలు విలేకరి,మెట్పల్లి, ఆగస్టు 4 :** ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం మెట్పల్లి పట్టణం లోని ఎస్సారెస్పీ గార్డెన్లో పట్టణానికి చెందిన లబ్దిదారులకు మంజూరైన తెల్ల రేషన్ కార్డులను అధికారులతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ పదేళ్ల పాటు పాలన చేసిన బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు రేషన్కార్డులను మంజూరు చేయలేదని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించా లనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్కార్డులు మంజూరు చేస్తున్నారన్నారు. మెట్పల్లి పట్టణంలో 2370 రేషన్ కార్డులను మంజూరు చేశామని,కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు జెట్టి లింగం, కోమి రెడ్డి తిరుపతిరెడ్డి, అల్లూరి మహేందర్ రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లక్ష్మణ్, నర్సాగౌడ్, రాజేశ్వర్ గౌడ్, ఖాజా అజీమ్, రాజేశ్వర్, రాజారెడ్డి, లక్ష్మణ్, భరత్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

**-పలు రికార్డులను పరిశీలించిన అధికారులు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 4 :** జగిత్యాల మున్సిపల్ కార్యాలయంపై గత కొన్నేళ్లుగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తున్న నేపథ్యంలో సోమవారం విజిలెన్స్ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.టౌన్ ప్లానింగ్, సానిటేషన్, రెవెన్యూ, ఇంజనీరింగ్, డీజిల్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయంటూ పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టడం జిల్లాలో చర్చనీ యాంశమైంది. గతంలో జగిత్యాల ఎమ్మెల్యేనే మున్సిపాలిటీకి బీమారు వచ్చిందని వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో కౌన్సిల్ సభ్యులు గతంలో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు మున్సిపల్ కార్యాలయానికి సంబం ధించిన నివేదికను ఇవ్వాలని ఆదే శించిన అధికారులుఇవ్వకపోవడం తో విజిలెన్స్ అధికారులే తనిఖీలు నిర్వ హించి పలు ఫైళ్లను పరిశీలించారు. ఈ విషయమై మాజీ కౌన్సిలర్ హన్మాండ్ల జయశ్రీ మాట్లాడుతూ అవినీతి అధి కారుల పై వెంటనే చర్యలు తీసుకో వాలని, మున్సిపాలిటీని పూర్తిగా ప్రక్షాళణ చేయాలని డిమాండ్ చేశారు.

# నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

**-కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్**



**చురకలు విలేకరి, కోరుట్ల, ఆగస్టు 4 :** నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ గుండా రవీందర్ గౌడ్ అన్నారు.సోమవారం కోరుట్ల పట్టణం లోని పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాదారులకు రూ.21,500 జరిమానా విధించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించామని, దుకాణదారులు, ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ను వాడవద్దని, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరిం చాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని, లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.ఈ తనిఖీల్లో సానిటరీ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, వార్డు అధికారులు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేజ్, సిబ్బంది రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోటేశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి



**చురకలు విలేకరి, వెల్గటూర్, ఆగస్టు 4 :** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారికి అత్యంత ప్రీతికరమైన రోజుతో పాటు శ్రావణ మాసం సోమవారం కావడంతో ఉమ్మడి జిల్లా నలు దిక్కుల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ లు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా గత కొద్దిరోజులుగా భక్తులు లేక బోసిపోయిన ఆలయ పరిసరం సోమవారం భక్తుల రద్దీ పెరగడంతో ఒక్కసారిగా సందడిగా మారింది.ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ పుదరి రమేష్, కార్యనిర్వాహన అధికారి కాంతారెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఐకేపి ఏపీఎంకు సన్మానం



**చురకలు విలేకరి, మెట్పల్లి, ఆగస్టు 4 :** మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఇబ్రహీంపట్నం మండల ఇందిరా క్రాంతి పథం ( ఐకేపి) అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఏ.శంకర్ ను కళాశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య మాట్లాడు తూ మహిళా సంఘాల అభ్యున్నతి కోసం శంకర్ చేసిన కృషి ప్రశంసనీయమని, ఇటీవలే కోరుట్ల నుంచి ఇబ్రహీంపట్నం మండలంకు బదిలీపై వెళ్ళారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న,కళాశాల అకాడమిక్ కో- ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, కామర్స్ హెచ్ ఓ డి ఏ మనోజ్ కుమార్,అంజయ్య, శ్రీకాంత్,దశరథం లతో పాటు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముత్తునూర్‌లో బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం



**చురకలు విలేఖరి,వెల్గటూర్,ఆగస్ట్ 4 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామం లో రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకుమండల పార్టీ అధ్యక్షులు చల్లూరి రామ చంద్రం గౌడ్ ఆధ్వర్యంలో సోమ వారం విస్తృత స్థాయికార్యకర్తల సమావేశంనిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల పై కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు. బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు కార్యాచరణ రూపొందించుకొని ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు.కెసిఆర్ ప్రభుత్వ హయాంలో చేసినఅభి వృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాలని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ను ప్రజల్లో ఎండగట్టాలని వివ రించారు. సర్పంచ్, ఎంపీటీసీ, స్థానాల్లో బిఆర్ఎస్అభ్యర్థులను గెలిపించుకోవాలనిపిలుపునిచ్చా రు.ఈకార్యక్రమంలో నాయకులు పత్తిపాక వెంకటేష్, జూపాక కుమార్,అనుమాల తిరుపతి, ముల్కళ్ళ గంగారాం,మూగల సత్యం, సునీల్, రవి, భాగ్య, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 :** ఇబ్రహీంపట్నం మండలం లోని అమ్మక్కపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సోమవారం సిసిఎస్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకోని వారి వద్ద నుండి రూ.17,350 నగదు, 7 సెల్ఫోన్లు,5 బైక్లను స్వాధీనం చేసుకొని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించి నట్లు సిసిఎస్ ఎస్ఐ రాజు తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు రమేష్, ఖాసీం, కాష్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## కోట బురుజులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



**చురకలు విలేకరి, కోరుట్ల, ఆగస్టు 4 :** కోరుట్ల పట్టణంలోని చారిత్రాత్మక కట్టడాలైన కోట బురుజులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు డా.పేట భాస్కర్ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చారిత్రాత్మక కట్టడాలైన కోట బురుజులు మూడు ఎకరాల 20 గుంటల స్థలంలో ఉన్నాయని, కోట బురుజులు అన్యాక్రాంతం అవుతూ అక్రమదారుల కబంధహస్తల్లో చిక్కుకున్నాయన్నారు. 2006 నుండి అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చారిత్రాత్మక కట్టడాలైన కోట బురుజులను కాపాడాలని కోరుతూ పోరాటం చేస్తున్నామన్నారు. చారిత్రాత్మక కట్టడాలైన కోట బురుజులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మార్కెట్, పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్న విశ్వనాథం, చింత భూమేశ్వర్, ఎండి. మౌలానా, భూపెల్లి నాగేష్, సుతారి రాములు, కుంచెం శంకర్, గంగాధర్, రాజగంగారాం తదితరులు పాల్గొన్నారు.

## క్షుద్రపూజల కలకలం



**చురకలు విలేకరి, వెల్గటూర్, ఆగస్టు 4 :** మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారి పక్కన ఆదివారం రాత్రి చోటు చేసుకున్న క్షుద్ర పూజల ఘటన కలకలం రేపింది.మండల కేంద్రానికి చెందిన గుమ్ముల అంజయ్య ఇంటి ఆవరణ ముందు గుర్తు తెలియని వ్యక్తులు నిమ్మకాయలు, కుంకుమ, ఆకులు, బొట్టు ఇతర పదార్థాలను ఉంచడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# యువత స్వయం ఉపాధి వైపు ప్రయాణించడం అభినందనీయం

**-హైదరాబాద్ వరహాలు అడ్వాన్స్డ్ స్టూడియో ఏర్పాటు**

**-ఏ.ఎస్.పి శేషాద్రిని రెడ్డి**



**చురకలు ప్రతినిధి,వేములవాడ, ఆగస్టు 04 :** ఒకటవ తరగతి నుండి బీటెక్ వరకు కలిసి చదువుకున్న నలుగురు యువకులు స్వయం ఉపాధి వెతుక్కుంటూ తమ భవిష్యత్తు కోసం సోమవారం అడుగులు వేశారు.బీటెక్ పూర్తి చేసుకొని ఉద్యోగ అవకాశాల కోసం కొంతకాలం ఎదురు చూశారు. ఉద్యోగాలు అందకపోవడంతో స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్‌లో మ్యాడ్ ఫోటోగ్రఫీ "ఇట్స్ ఎ న్యూ బిగినింగ్ స్టూడియో "ను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి శేషాద్రినిరెడ్డి స్టూడియోను సందర్శిం చారు.అనంతరం ఆమె మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి వైపు మొగ్గుచూపడం అభినందనీయం అన్నారు.హైదరాబాద్ లాంటి పట్టణాల్లో ఉండే అడ్వాన్స్డ్ ఫోటోగ్రఫీ పరికరాలతో వేములవాడలో ప్రారంభించడం సంతోషకరమని అన్నారు.అలాగే ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉన్న పాడ్కాస్ట్, ఇంటర్వ్యూస్, కూడా ఈ స్టూడియో లో నిర్వహించేందుకు వీలు కల్పించడం వల్ల సృజనాత్మకత ఉన్న యువతకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.పట్టణ ప్రజలకు ఎక్కడికో వెళ్లకుండా వేములవాడ పట్టణంలోనే అన్ని హంగులతో స్టూడియో అందు బాటులోకి తీసుకు వచ్చారని నిర్వాహ కులను ఏఎస్పి శేషాద్రినిరెడ్డి అభినం దించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహ కులు,క్లాస్ మేట్స్ అయిన ఇఖ్రార్ పాషా,అరవింద్,నితిన్,సునీల్‌తోపాటు తాహేర్ పాషా,నగుబోతు రవి,కుమ్మరి శంకర్, నారాయణ రెడ్డి,ఆనంద రెడ్డి, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ... తదితరులు ఉన్నారు.



# ఈ ఎస్ ఐ వైద్య సిబ్బందిని పెంచాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 4 :** ఎన్ టి పి సి లోని ఈఎస్ఐ డిస్పెన్సరీ లో వైద్యులను వైద్య సిబ్బందిని పెంచాలి అని కోరుతూ ఇన్చార్జి డాక్టర్ గాయత్రీ దేవికి కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అసంఘటిత కార్మిక వర్గ జిల్లా అధ్యక్షుడు అహ్మద్ బాబా వినతి పత్రం అందజేశారు. డిస్పెన్సరీలో ఇన్సురెడ్ వ్యక్తులకు అసౌకర్యం గురించి డాక్టర్కు వివరించారు.50,000 ఉన్న ఐపీలు కలిగి ఉన్న ఎన్టిపిసి డిస్పెన్స్ ఒక్క డాక్టర్ తో మాత్రమే నామమాత్రంగా వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందని ఎక్కడైతే పదివేల ఐపీలు ఉంటాయో ఎక్కువ అనగా ఆరుగురు వైద్యులు ఉండాలని నర్సింగ్ ఆఫీసర్స్ నలుగురు ఫార్మసిస్టులు ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్స్ అవసరం తగ్గట్టుగా నియమించాలి అని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే నాన్ మెడికల్ స్టాఫ్ హెడ్ క్లర్క్ ఒకటి యూ డి సి క్యాషియర్ ఒకటి యూ డి సి రెండు ఎల్డీసీ 1 మొత్తం షిఫ్ట్ వైస్‌గా ఉండాలని అన్నారు.నామమాత్రంగా ఉద్యోగులను పెట్టి తూతూ మంత్రంగా వైద్య పరీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్టిపిసి ఎజమాన్యం సిఎస్ఆర్ నిధులతో ఇక్కడికి వచ్చే స్థానికేతర కార్మికుల చేసుకొని దూరం నుండి వచ్చే వారికి అనుకూలంగా డిస్పెన్సరీని ఇంకా పెద్ద మొత్తంలో నిర్మించాలని కోరారు. వెంటనే డిస్పెన్సరీ కి మరమ్మతులు చేయాలని బాబా కోరారు.ఈ విషయం పై స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కా సింగ్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని బాబా తెలిపారు.

## గ్రోమోర్ సెంటర్

# సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



**-మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేసిన రైతులు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 04 :** రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారికి రైతులు సోమ వారం ఫిర్యాదు చేశారు,పదిర గ్రామాని కి చెందిన రైతులు మద్దుల పద్మా రెడ్డి,పరశురాం రెడ్డిలు 10 యూరియా బస్తాలు కావాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌కు వెళ్లారు ఇతరాత్ర మందులు తీసుకుంటేనే 10 యూరియా బస్తాలు ఇస్తా లేకుంటేనీ ఇష్టం వచ్చిన వాళ్లకు చెప్పుక పో అంటూ రైతులతో సిబ్బంది వాగ్వి వాదానికి దిగారు,దురుసుగా ప్రవర్తిం చారు.దీంతో రైతులు ఎల్లారెడ్డిపేట వ్యవసాయ అధికారి కార్యాలయానికి వెళ్లి గ్రోమోర్ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.రైతుల పట్ల దురుసుగా వ్యవ హరిస్తున్న ఇబ్బంది పెడుతున్న సిబ్బందిపై విచార ణ జరిపి చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా లింకులు పెట్టకుండా రైతులకు వ్యవసాయానికి అవసరమున్న మేరకు యూరియా బస్తాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పద్మా రెడ్డి పరశు రాం రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఆలయాలకు శ్రావణ సందడి

**-గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు**

**-ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అగష్టు (04) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని గోదుర్, తిమ్మపుర్, యామపుర్,ఫకీర్ కోండా పుర్,వేములకుర్తి,బర్దిపుర్,ములరాం పుర్,ఎర్దండి,కోమటికోండాపుర్,వర్షకోం డ,డబ్బ,అమ్మకపెట్, ఇబ్రహిం పట్నం, కేశాపుర్,కోజన్ కోత్తుర్ గ్రామలలోని ఆలయల లో శ్రావణ మాసం పురస్కరిం చుకొని సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుండే భక్తులు గోదా వరి పుణ్య స్నానాల ను అచరించి సమిపం లోని శివలయాల లో దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు.శ్రావణ మాసంలో నిత్యం భక్తుల సందడి ఉండే అవకాశం ఉన్నందున ఆలయ పరిసరాల్లో తగు ఏర్పాట్లతోపాటు,పరిశు భ్రత పాటించేలా చర్యలు చేపట్టాలని గోదవరి నది అలాయలలో భక్తులు అలయకమిటీ ముదస్తు సుచనలు జారిచేశారు.పలు చోట్ల అన్నప్రసాద కార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమంలో అయా గ్రామల అర్చకులు,అలయకమిటీ సభ్యులు, భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 04 :** తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదట కులగణన చేసి అట్టి బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలుపగా కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ బిల్లును ఆమోదించి షెడ్యూల్ 9 లో చేర్చి చట్టబద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కాలం గడుపుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కేంద్ర ప్రభుత్వాన్ని కి కనువిప్పు కలిగించి బీసీల చిరకాల ఆకాంక్ష నెరవేర్చాలని చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిరిసిల్ల నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా అదే ట్రైన్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌ను చేనేత సెల్ జిల్లా అధ్యక్షులు గోనె ఎల్లప్ప, టౌన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గడ్డం కిరణ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధులు రెడ్డిమల్ల భాను,గుడిసె ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు సబ్బని వేణులు కలిసి పేర్కొన్నారు.

# గొల్లపల్లిలో బీజేపీ మహా సంపర్క్ అభియాన్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 04 :** బిజెపి మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగ మండలం గొల్లపల్లి గ్రామంలో పలు బూతుల్లో ప్రధాని నరేంద్ర మోదీ గారు చేసిన అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, వాటి ప్రయోజనాలు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు రేపాక రామచంద్ర రెడ్డి మహిళా మోర్చా అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ. ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్ జిల్లా కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు పిట్ల శ్రీశైలం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మాలోత్ కిరణ్ నాయక్ మండల ఉపాధ్యక్షులు మల్లారపు మహేశ్ ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షులు గంట బాలకృష్ణ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూడవత్ రవి నాయక్ దండు నవీన్ బూత్ కమిటీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రోసీడింగ్ పత్రాలు మరియు నూతన రేషన్ కార్డులు పంపిణీ



**చురకలు ప్రతినిధి,మెట్ పల్లి, ఆగస్ట్ 04 :** మల్లాపూర్ మండలం మొగిలి పేట గ్రామం లో ఎస్సీ సబ్ ప్లాన్ నుండి నిధులు విడుదల చేపించి ఈ రోజు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభం చేసి అదే విధంగా ఎస్ డి ఎఫ్ నిధులు ల నుండి కృష్ణ యాదవ సంఘ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేసిన జువ్వాడి వారికి ప్రోసీడింగ్ పత్రాన్ని అందజేశారు.ఒక్క మొగిలి పేట గ్రామానికి 25 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. అనంతరం లబ్దిదారులకు నూతన రేషన్ కార్డు లను పంపిణీ చేసిన మన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు.

# 8న హుజురాబాద్‌లో ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతి

**-గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయండి**
**-శనిగరం బాబ్జి పిలుపు**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 4 :** ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ రెండో వర్ధంతిని విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శనిగరం బాబ్జి పిలుపు నిచ్చారు.సోమవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ..ఈనెల 8న హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్లో జరగనున్న ఈ సభకు పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు. పీడిత, తాడిత ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్‌కు ఘన నివాళులు అర్పించాల న్నారు.ముఖ్య అతిథిగా గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతి సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్, ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాసిం హాజరవుతారని తెలిపారు.గద్దర్ జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కళాకారులచే గద్దర్‌కు ఆట,పాటల రూపంలో నివాళి కార్యక్రమం ఉంటుందని,అనంతరం అక్కడి నుండి సిటీ సెంట్రల్ హాల్ వరకు ర్యాలీగా నిర్వహిస్తామని ఆయన వివరించారు. కవులు,కళాకారులు,రచయితలు, మేధావులు,విద్యావంతులు, ప్రజాసం ఘాల నాయకులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని గద్దర్ ఆశయా లను స్మరించుకోవాలని బాబ్జి కోరారు. ఈ సమావేశంలో ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు రామంచ భరత్, డప్పు వాయిద్య కారుడు ఎర్ర సురేష్, ప్రముఖ గాయకుడు రావుల సాయి పాల్గొన్నారు.

# గుండెపోటుతో కన్నుమూసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

**-ఉపాధ్యాయుడు జవహర్ రెడ్డి ఇకలేరు**
**-మిత్రుల్లో, ఉపాధ్యాయ వర్గాల్లో విషాదం**

**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ ఆగస్టు 04 :** హుజురాబాద్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు అలుగువెల్లి జవహర్ రెడ్డి (జవహర్ పటేల్) (61) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు.హుజురాబాద్ పట్టణానికి చెందిన దివంగత విశ్రాంత ఉపాధ్యాయుడు అలుగువెల్లి వెంకట్ రెడ్డి - సుదేష్ణ దంపతుల కుమారుడైన జవహర్ రెడ్డి హుజురాబాద్‌లో విద్యాభ్యాసం చేసారు.1984లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు.రామగుండం, ఓదెల, భీమదేవరపల్లి,ఎల్కతుర్తిలలో సుదీర్ఘ కాలం ఉపాధ్యాయునిగా పనిచేసారు.ఆయనకు సౌమ్యునిగా, అజాత శత్రువుగా పేరుంది.ఎవరు కలిసినా.. నవ్వుతూ పలకరించేవారు. అంకితభావంతో విధులు నిర్వహించే వారు.ఇటీవలే.. కమాన్‌పూర్ మండలం నర్సింహులపల్లికి బదిలీపై వెళ్లారు. అయన ఈ నెల (ఆగస్టు) 31న ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది.ప్రస్తుతం అయన హనుమకొండలోని చైతన్యపురి లో నివాసముంటున్నారు.గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడు తున్న అయన చికిత్స నిమిత్తం హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చేరినట్లు తెలిసింది.చికిత్స పొందుతున్న అయన అనుకోనిరీతిలో గుండెపోటు రావడంతో ఆదివారం తెల్లవారుజామున ఆరు గంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆయనకు భార్య శ్రీదేవి,కుమారులు అలుగువెల్లి శశాంక్ రెడ్డి,శంతన్‌రెడ్డి ఉన్నారు. కుమారులిద్దరూ..అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు.సుమారు 41 ఏళ్ళు విద్యాశాఖలో పనిచేసిన అయన ఉద్యోగ విరమణ చేసే నెలలోనే.. గుండెపోటుతో మృతి చెందడంతో.. స్థానిక పట్టణంలో,ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.స్నేహితుల దినోత్సవం రోజే అయన మృతి చెందడంతో అయన మిత్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్‌లో అయన క్రియాశీలక భూమిక పోషించారు. అయన మృతికి పలువురు సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.జవహర్ రెడ్డి అంత్యక్రియలు అయన కుమారులు అమెరికా నుండి ఇక్కడికి చేరుకున్న అనంతరం మంగళవారం ఉదయం హనుమకొండలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

**పలువురి సంతాపం**

ఉపాధ్యాయుడు జవహర్ రెడ్డి ఆకస్మిక మృతికి పలువురు సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.హుజురాబాద్ వాసులు పంజాల కళాధర్, కరీంనగర్ జిల్లా పరిశ్రమల శాఖా డిప్యూటీ డైరెక్టర్ వడ్డి సాల్మన్ రాజ్, జిల్లా వ్యవసాయాధికారి కేసరి నగేష్,తహసీల్దార్ పోతిరెడ్డి రవీందర్,వ్యాపారవేత్తలు చొక్కారావు నర్సయ్య,చొల్లేటి రాధాస్వామి,ఐరెడ్డి భాస్కర్ రెడ్డి,చొల్లేటి గంగాధర్, ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ఆవునూరి సమ్మయ్య,ఎల్ఐసి సతీష్ బాబు, విశ్రాంత హెడ్ మాస్టర్ రవిశంకర్ శు క్లా,నరెడ్ల రాజు,ఎర్రం నవీన్ రెడ్డి, పలకల శ్రీనివాస్ రెడ్డి, రేమిడి లింగా రెడ్డి, విశ్రాంత పీఈటీ పవన్, విశ్రాంత జిల్లా బీసీ సంక్షేమాధికారి మోకిలా రాజేందర్, చాడ గంగాధర్ రెడ్డి,గంగం ప్రవీణ్ రెడ్డి,జిన్న ప్రకాష్ రెడ్డి, ఇల్లందుల జానీ,పొన్నోజు సంతోష్, కాజీపేట కృష్ణ ప్రసాద్,తాళ్ల సత్య నారాయణ,ఆలేటి రవీందర్, జూపూడి కృష్ణ కుమార్ నాయుడు,క్యాస రాజేంద్ర ప్రసాద్,ముజమ్మిల్ అహ్మద్ షంషీ, శ్రీనివాసరావు దేశముఖ్, ధర్మరాజుపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మా రెడ్డి, పల్లె సంజీవ రెడ్డి, కేసరి మధుకర్, విడుపు శ్రీనివాస్, మధు కుమార్, మంచికట్ల భాస్కర్, కరాటే రమేష్, సాయిరూప వాసు, పలువురు ఉపాధ్యాయ సంఘం నేతలు సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# మచ్చలేని పోలీసు అధికారిగా.. రంగరాజు భాస్కర్ ప్రస్థానం

**-ఉద్యోగ విరమణ చేసిన భాస్కర్‌కు ఘనసన్మానం**




**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, ఆగస్టు 4 :** 36 ఏళ్ల సుదీర్ఘకాలం పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి మచ్చలేని అధికారిగా, వివాద రహితునిగా పేరుతెచ్చుకున్న రంగరాజు భాస్కర్ ఉద్యోగ విరమణ సన్మాన సభ ఆదివారం హనుమకొండల్లోని ఓ ప్రయివేటు వేడుకల మందిరంలో జరిగింది.ఈ కార్యక్రమానికి అయన పోలీసు అధికారులు,మిత్రులు, కుటుంబ సభ్యులు,బంధువులు, అభిమానులు హాజరై ఘనంగా సన్మానించారు. పలువురు అయన పోలీసు శాఖా ద్వారా ప్రజలకు అందించిన సేవలు ప్రశం సించారు. శాంతిభద్రతల విషయంలో అయన కఠినంగా వ్యవహరించారని గుర్తు చేసారు.

భాస్కర్ ప్రస్థానం ఇదీ..

1989లో ఎస్సైగా విధుల్లో చేరిన అయన మొదట పూర్వ కరీంనగర్ జిల్లా రాయికల్, జగిత్యాల రూరల్, పెద్దపల్లి, జమ్మికుంట, హుజురాబాద్ లలో పనిచేసారు. 1998లో సి ఐ గా ప్రమోషన్ పొంది పూర్వ ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, బోథ్, కోరుట్ల, బెల్లంపల్లి లలో పనిచేసారు. ఆంతరం 2009లో డీఎస్పీగా ప్రమోషన్ పొంది అనంతపూర్ జిల్లా ఎసిబి విభాగంలో, కరీంనగర్ సి ఐ డి విభాగంలో కొత్తగూడెంలో కరీంనగర్ పోలీసు శిక్షణ కేంద్రంలో, హైదరాబాద్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ లో పనిచేసారు. అడిషనల్ ఎస్పీగా 2017లో ప్రమోషన్ పొందిన అయన గద్వాల, వికారాబాద్ లలో పనిచేసారు. 2019లో వరంగల్ ఇంటెలిజెన్స్ విభాగం అడిషనల్ ఎస్పీగా పనిచేసారు. 2021లో ఎస్పీగా ప్రమోషన్ పై వరంగల్ రీజినల్ ఇంటెలిజెన్స్ అధికారిగా పనిచేసి జులై 31 న ఉద్యోగ విరమణ చేసారు. తన ఉద్యోగ ప్రస్థానంలో ఎన్నో క్లిష్టమైన కేసులు అయన చేధించారు. ఎన్నో అవార్డులు రివార్డులు అందుకున్నారు. ఫ్రెండ్లి పోలీస్ గా పేరుతెచ్చుకున్నారు. ఎన్నో పోలీసు పథకాలతో పాటు ఇండియన్ పోలీస్ మెడల్ అయన అందుకున్నారు. హుజురాబాద్ పాత్రికేయులు గడ్డం రాజిరెడ్డి, కోరెం సుధాకర్ రెడ్డి, ఆవునూరి సమ్మయ్య, తిరునగరి ఆంజనేయస్వామి, కుడికాల సురేష్ బాబు, కేశిరెడ్డి నర్సింహా రెడ్డి, మామిడి రవీందర్, పోరెడ్డి శంతన్ రెడ్డి తదితరులు రంగరాజు భాస్కర్ కు అభినందనలు తెలిపారు.

## నేటి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి సమావేశానికి తరలిరండి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 4 :** పెద్దపల్లి జిల్లా కేంద్రం తోపాటు సుల్తానాబాద్‌లో మంగళవారం జరిగే రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు సమావేశానికి భారీ ఎత్తున కార్యకర్తలు నాయకులు కమాన్ పూర్ నుండి తల్లి రావాలని కమాన్ మండల బిజెపి అధ్యక్షుడు కొయ్య సతీష్ కోరారు.ఉదయం 9:30 గంటలకు సుల్తానాబాద్ మండలం అలాగే 11:30 గంటలకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎంపీ గార్డెన్‌లో కార్యక్రమాలు నిర్వహించబడును.కావున కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**చురకలు విలేకరి, కొడిమ్యాల, ఆగస్టు 4 :** కొడిమ్యాల మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం చొప్పదండి నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పర్లపల్లి ఏలియా, జిల్లా అడకాక్ కమిటి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా బొల్లుమల జీవన్ ఇండియా, ఉపాధ్యక్షునిగా కొత్తూరి రత్నం, ప్రధాన కార్యదర్శి బల్ల అబ్రహం, కోశాధికారిగా అహరోను, సహాయ కార్యదర్శిగా ఎలీషా, కార్యవర్గసభ్యులుగా స్టిఫెన్, జాన్ పాల్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడక్టార్ కమిటి సభ్యులు దయానంద్, ప్రభుచరణ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


## వికలాంగుడి వినూత్న నిరసన

**-కలెక్టరేట్ ఆవరణలో కింద పడుకొని నిరసన**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 4 :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన మగ్గిపెల్లి రాజగంగారాం అనే వికలాంగుడు తన ఇంటికి దారి ఇవ్వడం లేదని ఈవిషయం గత ఎనిమిదేళ్లుగా పోరడుతున్నా ఫలితం లేకపోవడంతో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో కింద పడుకొని వినూత్నంగా నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా మగ్గిపెల్లి రాజగంగారాం మాట్లాడుతూ తన ఇంటికి వెళ్లడానికి దారి ఇప్పించాలని గత ఎనిమిదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని,అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వద్దకు చేరుకొని కింద పడుకొని నిరసన తెలిపానన్నారు. బాధితుడి వద్దకు చేరుకున్న పోలీసులు అధికారుల వద్దకు తీసుకెళ్లగా అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన బాధితుడు విరమించాడు.

## సోమేశ్వర కొండకు పోటెత్తిన భక్త జనం



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఆగస్టు 4 :** మల్లాపూర్ మండల కేంద్రంలోని కనక సోమేశ్వర కొండకు సోమవారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం రెండవ సోమవారం కావడంతో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకార్ధనలు చేపట్టారు. స్వామి వారి పూజలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్నదానంతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# కమీషనరేట్ పరిధిలో 193 మంది విముక్తి..18 కేసులు

**-రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా**




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ గోదావరిఖని ఆగస్టు 4 :** బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరం లో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన/ వదిలివేయబడిన,వివిధ రకాల బాల కార్మికులు కిరాణం షాప్‌లలో, మెకానిక్ షాపులలో,హోటళ్లలో,వివిధ కంపనీల లో పనిచేస్తూ మరియు రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాలకార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా చిల్డ్రన్ హోమ్ కు పంపించడం జరుగుతుంది. దానిలో భాగంగా కమీషనరేట్ వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్-XI కార్యక్రమం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్, వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా ముగిసిందని రామగుండము పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు.రామగుండము కమీషనరేట్ పరిధిలో ప్రతి డివిజన్ పరిధిలో ఒక ఎస్.ఐ మరియు నలుగురు సిబ్బందిని నియమించి టీం లు ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని అన్నారు.ఈ సంవత్సరం జూలై 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమాన్ని కమీషనరేట్ వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించడం జరిగిందనీ, దానిలో కమీషనరేట్ పరిదిలో (193) మంది బాల బాలికలను గుర్తించడమైనదని తెలిపారు. పెద్దపల్లి జిల్లా పరిదిలో బాలురు-52,బాలికలు-19 మొత్తం మంది-71, మరియు 06 కేసులు నమోదు చేసి 08 బాలకార్మికులని విముక్తి చేసి పాఠశాల లో చేర్పించడం జరిగినది. మంచిర్యాల జిల్లా పరిదిలో బాలురు-84, బాలికలు-38, మొత్తం మంది-122 మంది మరియు 12 కేసులు నమోదు చేసి 13 మంది బాలకార్మికులని విముక్తి చేసి పాఠశాల లో చేర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సిపి గారు మాట్లాడుతూ... బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, మరియు ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుందనీ, అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 (చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్) వారికి మరియు డైల్ 100 కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరనీ తెలిపారు. బాల కార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని సీపీ గారు అభినందించారు.

# పెద్దగుట్ట పాత నర్సింహాస్వామికి వరదపాశం



**చురకలు విలేకరి, బీర్పూర్, ఆగస్టు 4 :** బీర్పూర్ మండల కేంద్రంలోని పెద్దగుట్టలో వెలసిని పాత శ్రీలక్ష్మినర్సింహస్వామికి ఈ నెల 16న వరదపాశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజరులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణమాసంలో స్వామివారికి వరదపాశం నిర్వహించి సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు మంచిగా పండాలని స్వామివారికి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. పురాతన కాలం నుండి ఈ ఆనవాయితీ వస్తుందని, ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోషాచార్యులు, చిన్న సంతోష్ చార్యులు, మధుచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ అవార్డుకు ఎంపిక



**చురకలు విలేకరి, కోరుట్ల, ఆగస్టు 4 :** బహుజన సాహితీ అకాడమీ వుమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డు 2025కు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ , హెల్పర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటి ప్రకటించింది. అవార్డు సెలెక్షన్ కమిటి నేషనల్ చైర్మన్ బిఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయంలో అందజేశారు.ఈ సంధర్భంగా నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ ఎస్సి, ఎస్టి., బిసి, మైనారిటిల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమి వారు ప్రతి ఏట ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదిన ఆంధ్రప్రదేశ్లోని తిరుపతిలో నిర్వహించే బహుజన సాహిత్య అడాడమి 18వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగ ఈఅవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు.

# ప్రభుత్వ నిబంధన మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలి

**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 4 :** ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని మున్సిపల్ మేనేజర్ వెంకట్ అన్నారు.సోమవారం రాయికల్ పట్టణంలోని 1,2,8,9, 10,12వ వార్డులో, మైతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి,ఆన్లైన్ చేశారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు వారు సూచించిన స్థలాన్ని చదును చేసి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి లబ్ధిదారులు 400 స్క్వేర్ ఫీట్స్ కు తగ్గకుండా 600 స్క్వేర్ ఫీట్స్ కు పెరగకుండా ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు స్థానిక మున్సిపల్ వార్డు అధికారులు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణం చేపట్టేలా సూచనలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులు రజాక్, గంగారెడ్డి,శేఖర్,కిషన్,విజయ్,హరీష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోపి రాజారెడ్డి,మచ్చ శేఖర్,బాపురపు రాజీవ్, కొత్తపెల్లి గోపాల్, తలారి రాజేష్,



కడకుంట్ల నరేష్,రాకేష్ నాయక్, బత్తిని నాగరాజు,రాజారెడ్డి,నాయకులు శివ,బొమ్మకంటి నవీన్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలి




**చురకలు విలేకరి, బీర్‌పూర్,ఆగస్టు 4 :** ప్రసవించిన గంటలోపు ముర్రు పాలు తప్పకుండా బిడ్డకు పట్టించాలని ఆ పాలలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని సూపర్వైజర్ శైలజ అన్నారు.సోమవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బీర్పూర్ సెక్టార్ లోని నర్సింహులపల్లి అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత , బిడ్డకు ఆరు నెలల వయసు వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని, ఆ పాలల్లో పోషక విలువలన్ని ఉంటాయని అవగాహన కల్పించారు. ఐదు సంవత్సరాల వయసు వరకు తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని అంగన్వాడి సేవలను వినియోగించుకోవాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి , రాజ్యలక్ష్మి , స్వప్న , కళావతి, లక్ష్మి, ఆయాలు , తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్



**- గ్రీన్ వుడ్ విద్యార్థుల సత్తా**

**04 :** ఖమ్మం జిల్లాలో సందేశ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియా డబ్ల్యూ ఎఫ్ ఎస్ కె ఓ కరాటే చాంపియన్ షిప్ 2025 టోర్నమెంట్ లో గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులు గొప్ప ప్రతిభను కనబరిచారు.

**ఈ పోటీలో పాల్గొన్న గ్రీన్ వుడ్ విద్యార్థులు:**

అబ్దుల్ ముక్సిత్ - గోల్డ్ (కుమితే),శైమ మెహ్రీన్ - గోల్డ్ (కుమితే),అఫీరా ఖానం - గోల్డ్ (కుమితే),అబ్దుల్ ముజిల్ - గోల్డ్ (కుమితే),మహమ్మద్ అబుజర్ -గోల్డ్ (కుమితే),షేక్ అమన్ - గోల్డ్ (కుమితే),అబ్దుల్ హది - గోల్డ్ (కుమితే) ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా హాసన్ ఎమ్. ఇస్మాయిల్, వి. చంద్రశేఖర్ (బ్లాక్ బెల్ట్ , తెలంగాణ ప్రెసిడెంట్), రచ్చ శ్రీనివాస్ (గ్రాండ్ మాస్టర్), పవన్ మాస్టర్, గ్రీన్ వుడ్ పాఠశాల కరెస్పాండెంట్ అబ్దుల్ మోయిస్ హాజరయ్యారు.

**విద్యార్థులను అభినందించిన ప్రముఖులు :**

ఆర్.డీ.ఓ. జీవాకర్ రెడ్డి (కోరుట్ల) తహసీల్దార్ ఎం. వసంత (మెట్ పల్లి)

కేరళ హైస్కూల్ ప్రిన్సిపాల్ సెలీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహమూద్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉమేరియా సుల్తానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు. విద్యార్థుల విజయంపై పాఠశాల యాజమాన్యం గర్వంగా స్పందించింది. వారు శ్రమించి సాధించిన ఈ గెలుపు పాఠశాల గౌరవాన్ని మరింతగా పెంచిందని తెలిపారు.

# కోరుట్లలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



**చురకలు విలేకరి, కోరుట్ల, ఆగస్టు 4 :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కోరుట్ల పట్టణంలోని 33వ వార్డులోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన పోషణ, సంరక్షణ ఇవ్వడంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ప్రసవం, ప్రసవానంతర కాలంలో తల్లి పాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మహిళా అధ్యక్షురాలు మచ్చ కవిత, సహాయ కార్యదర్శి ఎంబేరి సత్యనారాయణ, ఎ ఐ టి యు సి రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సాయి ఈశ్వరి, సూపర్వైజర్ ఏ. భారతి, అంగన్వాడి టీచర్ జయ నీలిమ, వార్డు ఇంచార్జ్ చిటిమెళ్లి రంజిత్ గుప్తా కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
**-189 దరఖాస్తుల రాక**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 04 :** ప్రజావాణి అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో ప్రజల నుంచి కలెక్టర్ సోమవారం అర్జీలు స్వీకరించారు. మొత్తం 189 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు పెండింగ్ లో పెట్టవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తుల వివరాలు. రెవెన్యూ శాఖకు 69, హౌసింగ్ శాఖకు 50, డీఆర్డీఓ 17, ఉపాధి కల్పన శాఖ, ఎస్డీసీకి ఎనిమిది చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారికి ఆరు చొప్పున, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయానికి ఐదు చొప్పున, సెస్, జిల్లా వ్యవసాయ అధికారి, ఎస్పీ ఆఫీస్ కు మూడు చొప్పున, జీజీహెచ్, ఈఓ వేములవాడ రాజరాజేశ్వర ఆలయానికి రెండు చొప్పున, జిల్లా వైద్యాధికారి, ఎల్ డీ ఎం కు ఒకటి చొప్పున వచ్చాయి.

**భూ సమస్యను వెంటనే పరిష్కరించాలి**

భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లను కలెక్టర్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొలకాని శంకరయ్య, లస్మయ్య ఇద్దరు అన్నదమ్ములకు చెందిన 28 గుంటల వారసత్వ భూమిని లస్మయ్య కొడుకు రవి.. శంకరయ్యకు తెలియకుండా 2016లో ధరణిలో పట్టా చేసుకున్నాడు. దీంతో శంకరయ్య గత ఏడాది కలెక్టర్ కు ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. వారసత్వ భూమిపై విచారణ చేసి ఇద్దరికీ సమానంగా పంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదికను సిరిసిల్ల ఆర్డీఓకు పంపగా, అక్కడ పెండింగ్ లో ఉంది. ఈ క్రమంలో తన భూ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ కు సోమవారం ప్రజావాణిలో శంకరయ్య ఫిర్యాదు చేయగా, వెంటనే సిరిసిల్ల ఆర్డీఓను పిలిచి తానూ ఆదేశించినా భూ సమస్యను పరిష్కరించరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే భూ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# మొదటి తప్పుగా భావించి కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి

**-రెండు గ్రామాల్లో విధులు నిర్వహించడం వల్లే ఈ తప్పిదం**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 4 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోతో ఫేస్ రికగ్నైజేషన్ యాప్ లో హాజరు వేసుకున్నారనే ఆరోపణతో బుగ్గారం మండలం చంద్రయ్యపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయగా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ సస్పెన్షన్ కు గురైన పంచాయతీ కార్యదర్శి రాజన్న కు మరో గ్రామ పంచాయతీ అయిన సిరికొండ కు కూడా ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆ సమయంలో చందయ్య పల్లిలో నిర్ణీత సమయంలోగా అటెండెన్స్ వేయాల్సి ఉండగా అక్కడి గ్రామ సహాయకునికి అటెండెన్స్ వేయమని చెప్పడం వల్ల ఈ పొరపాటు జరిగిందని, ఇది కావాలని చేసిన పొరపాటు కాదని, మొదటి తప్పుగా భావించి పంచాయతీ కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూలై 1, 2 తేదీలలో సిరికొండలో విధుల్లో హాజరైన రాజన్న తన సహాయకుడికి చందయ్యపల్లిలో అటెండెన్స్ వేయమని చెప్పడం వల్ల అతనికి ఫేస్ రికగ్నేషన్ యాప్ పై అవగాహన లేకపోవడంతో పొరపాటున ముఖ్యమంత్రి ఫోటో అప్లోడ్ అయిందని వివరణ ఇచ్చారు. గత 18 నెలలుగా గ్రామపంచాయతీలకు కేంద్ర నిధులు గాని, రాష్ట్ర నిధులు గాని రాకపోయినప్పటికీ తమ సొంత డబ్బులతో గ్రామ పంచాయతీకి సంబంధించిన అత్యవసర సేవలను అందిస్తున్నామని, గత ఆరు నెలల జీతం కూడా తమకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఖర్చుపెట్టిన బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు, పని భారం, ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శులు ఎన్నో ఇబ్బందులు పడుతూ కూడా 98 శాతం మంది కార్యదర్శులు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారని ఎవరో కొంతమంది చేసిన తప్పిదానికి పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థను తప్పు పట్టడం సమంజసం కాదన్నారు. గ్రామపంచాయతీ విధులతోపాటు అదనపు పనుల వల్ల కూడా పంచాయతీ కార్యదర్శులు మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా బాధ్యులు శ్రీకాంత్, సతీష్ కుమార్, రాజు, రవి, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేదలకు చేదోడుగా లైన్స్ క్లబ్

**-లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 4 :** పేదలకు చేదోడుగా కమాన్ పూర్ లైన్స్ క్లబ్ పనిచేస్తుందని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం కమాన్ పూర్ మండలంలోని రొంపి కుంట గ్రామంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి బీదలకు చేదుడుగా ఉండడం జరుగుతోందని దీనిలో భాగంగా కంటి ఆపరేషన్లు చేసుకోలేని స్థితిలో ఉన్న వారికి రేకుర్తి కంటి ఆస్పత్రి వారి సహకారంతో వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి వారిని రేకుర్తికి లైన్స్ క్లబ్ వారి బస్సులో తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి మళ్లీ గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని అన్నారు. ఇప్పటివరకు గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలతో పాటు మండలంలోని తొమ్మిది గ్రామాలకు విద్యుత్ దీపాలను అందించడం జరిగిందని పేర్కొన్నారు. మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేస్తామని అన్నారు. కాగా ఈ రొంపిగుంటలో జరిగిన ఉచిత వైద్య శిబిరం లయన్ గుమ్మడి అంజన్న ఆధ్వర్యంలో టెక్నీషియన్ ప్రభాకర్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ నల్లవెల్లి శంకర్, లయన్ జబ్బార్ ఖాన్, లయన్ చొప్పరి సంతోష్, లయన్ చెప్పాల సమ్మయ్య, లయన్ బండ సాయి శంకర్, లయన్ బాలు, తోపాటు నాయకులు కమ్మగొని మల్లయ్య హెల్పర్ శ్రీనివాస్ ఏఎన్ఎం శ్యామల తో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతి కోసం

# కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది



**-స్వయం ఉపాధి కోసం మహిళల కృషి అభినందనీయం**
**-మహిళా సంఘాలకు అండగా రేవంత్ సర్కార్**

**చురకలు ప్రతినిధి,వేములవాడ, ఆగస్టు 04 :** మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ఎల్లవేళలా పాటుపడుతుందని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్పు ఆది శ్రీనివాస్ అన్నారు.సోమవారం పట్టణంలోని భగవంతరావునగర్లో నూతనంగా ఏర్పాటుచేసిన రాజ రాజేశ్వరి బోటిక్ అండ్ బ్యూటీ పార్లర్లతో పాటు మ్యాచింగ్ సెంటర్ను సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు స్వయం ఉపాధి కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు.మహిళా సంఘాల కోసం,మహిళల అభివృద్ధి కోసం, మహిళా మణులను లక్షాధికారులు చేయడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుంది అన్నారు.తమ స్వయంకృషితో రాజరాజేశ్వరి సెంటర్ ను ప్రారంభించుకున్న మారేపు హేమలత,శీలం స్వప్న,చందనగిరి తేజస్విలను ఆది శ్రీనివాస్ అభినం దించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,రాజరాజేశ్వరి సెంటర్ నిర్వాహకులు,వారి బంధువులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన



**చురకలు విలేకరి,మెట్పల్లి రూరల్, ఆగస్టు 4 :** తల్లిపాల వారోత్సవాలు భాగంగా మండలంలోని కోనరావుపేట గ్రామంలో ఐసిడిఎస్ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భిణి,బాలింతలకు ముర్రుపాల ఆవశ్యకత గురించి వివరిస్తూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు నవజాత శిశువుకు వెచ్చదనం, పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రత గురించి తల్లులకు వివరించి స్థానికంగా దొరికే కూరగాయలు పండ్లు మరియు సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ప్రభావతి,ఐసిడిఎస్ సూపర్వైజర్ షమ్మీ సుల్తానా,ఏఎన్ఎం సరోజ,శ్వేత,ఆశ కార్యకర్తలు,అంగన్వాడీ టీచర్లు అనూష, రామదేవి,సుజాత,స్వప్న తల్లులు కిషోర బాలికలు పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకునే దేవుడు శ్రీధర్ బాబు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 4 :** తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ తనదైన శైలిలో సహాయం చేస్తున్నారు. సోమవారం మంథని మండలంలోని అరెంద గ్రామానికి చెందిన గడెపు రాజేశ్వరి అనారోగ్యానికి సంబంధించి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సహాయం నిమిత్తం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబును సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి బాధితురాలుకి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 4 లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కును మంజూరు చేయించారు. మంత్రి ఆసుపత్రి సహాయకులు ఆ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంటనే స్పందించి ఆదుకున్నందుకు మంత్రి శ్రీధర్ బాబుకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు పైన ప్రశంసల వర్షం కురిపించారు.